# నల్లమల యాత్రకు గ్రీన్‌సిగ్నల్

■ నేటి నుంచి సఫారీయాత్ర ప్రారంభం



అమ్రాబాద్ సఫారీ వాహనాలు(ఫైల్)

అమ్రాబాద్, సెప్టెంబర్ 30 : అమ్రాబాద్ టైగర్ రిజర్వు ఫారెస్టులో జంతువుల సంతతి కోసం మూడు నెలలు (జూలై నుంచి సెప్టెంబర్ వరకు) అటవీశాఖ అధికారులు పర్యాటకులను అనుమతించలేదు. తిరిగి ఆదివారం నుంచి సఫారీ యాత్ర ప్రారంభం కానున్నది. ఏటీఆర్‌లో ఫర్హాబాద్ ద్వారం నుంచి జంగిల్ సఫారీ యాత్ర ప్రారంభించి నల్లమల అడవుల్లోని వృక్ష జాలం, జంతుజాలం గురించి పర్యాటకులకు వివరిస్తూ యాత్ర ముందుకు సాగుతుంది. ఇందుకు సంబంధించి సఫారీ వాహనం నిర్ణీత మార్గంలో వెళ్తుందో లేదోనని జీపీఎస్ ట్రాకింగ్ ద్వారా అటవీశాఖ జిల్లా అధికారి రోహిత్‌గోపిడి పర్యవేక్షిస్తారని మన్ననూర్ ఫారెస్టు రేంజ్ అధికారి ఈశ్వర్ తెలిపారు. సఫారీ వాహనంలో ఒక నేచర్‌గైడ్ ఉంటారని, ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు యాత్ర ఉంటుందన్నారు. ఒకరికి రూ.2వేల రుసుముతో మన్ననూర్ అటవీశాఖ కార్యాలయంలో, ఆన్‌లైన్ ద్వారా యాత్రకు బుకింగ్ చేసుకోవచ్చని వివరించారు. ఒక్కో వాహనంలో 7మందికి అనుమతి ఉంటుందన్నారు.

# పాతికేండ్లకు రైలు పరుగులు

■ మునీరాబాద్-కృష్ణ రైల్వేలైన్ పూర్తి ■ నేడు రైలు ప్రారంభం



ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డికి రైలు ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరుకావాలని ఆహ్వానిస్తున్న రైల్వే అధికారులు

మరికల్, సెప్టెంబర్ 30 : మునీరాబాద్– కృష్ణా రైల్వే లైన్ పనులు ఎట్టకేలకు పూర్తయ్యాయి. ఆదివారం కాచిగూడ నుంచి కృష్ణ, రాయిచూర్ వరకు తిరిగేందుకు అధికారులు పచ్చజెండా ఊపనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో చేపడుతున్న రైల్వేలైన్ పనులు దేవరకద్ర నుంచి కృష్ణ వరకు పూర్తయ్యాయి. అధికారులు ట్రయల్ రన్ నిర్వహించినా రైలు నడపలేదు. గూడ్స్ రైలు మాత్రమే నడిపించారు. నిత్యం హైదరాబాద్ నుంచి రాయిచూర్‌కు వందలాది మంది బస్సు ప్రయాణం చేస్తున్నారని, ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడిపించి దేవరకద్ర, మరికల్, మక్తల్ స్టేషన్లలో నిలిపేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

## ఎమ్మెల్యే చిట్టెంకు ఆహ్వానం..

మక్తల్ టౌన్, సెప్టెంబర్ 30 : రాయిచూర్–కాచిగూడ డెమో రైలు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి హాజరు కావాలని కోరుతూ దక్షిణమధ్య రైల్వే గుంతకల్ డివిజన్ సీటీటీఐ రాయిచూర్ స్టేషన్‌కి సంబంధించిన అధికారులు సలోమన్, బసప్ప శనివారం ఆహ్వాన పత్రికను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మునిరాబాద్–కృష్ణ రైల్వేలైన్ పూర్తయిన సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం 2:15 గంటలకు కృష్ణ రైల్వేస్టేషన్‌లో రాయిచూర్–కాచిగూడ డెమో రైలును ప్రారంభించనున్నట్లు తెలిపారు.

# అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

తిమ్మాజిపేట, సెప్టెంబర్ 30 : మండలంలోని అమ్మపల్లిలో వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్లు ఎస్సై భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మండలంలోని పుల్లగిరికి చెందిన బీసర్ల మునయ్య(45) భార్యతో కలిసి అమ్మపల్లిలో ఓవ్యక్తి దగ్గర రెండేళ్లుగా పని చేస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం రాత్రి భోజనం అనంతరం పడుకున్న మునయ్య శనివారం తెల్లవారుజామున మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి సోదరుడు గోపాల్ మునయ్య తలపై గాయాలున్నాయని, మృతిపై అనుమానాలు ఉన్నాయని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# దొంగల ముఠా అరెస్టు

■ నిందితుల నుంచి 12ఆటోలు స్వాధీనం

■ వివరాలు వెల్లడించిన ఎస్పీ సృజన



స్వాధీనం చేసుకున్న 12 ఆటోలతో ఎస్పీ సృజన

గద్వాల అర్బన్, సెప్టెంబర్ 30 : అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పట్టుకొని వారి నుంచి పెద్ద మొత్తంలో వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు జోగుళాంబ గద్వాల ఎస్పీ కె.సృజన తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని గద్వాల టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఇందుకు సంబంధించి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈనెల 2వ తేదీన జిల్లా కేంద్రంలోని సుంకులమ్మ మెట్టు కాలనీకి చెందిన పక్రుద్దీన్ తన ఇంటి ఎదుట నిలిపిన ఆటో కనిపించకపోవడంతో 4వ తేదీన టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. 29వ తేదీన అయిజ రింగ్ రోడ్డు సమీపంలో గద్వాల టౌన్ పోలీసులు, సీసీఎస్ పోలీసులు వాహనాల తనిఖీ చేపడుతుండగా, అనుమానాస్పదంగా ఇద్దరు వ్యక్తులో ఆటోలో వెళ్తుండగా వాహనానికి సంబంధించిన పత్రాలు చూపించాలని అడిగారు. వాహన పత్రాలు లేకపోవడంతో పారిపోయేందుకు ప్రయత్నించగా, వారిని పట్టుకొని విచారణ చేపట్టమన్నారు. హైదరాబాద్‌లోని ఫలక్‌నుమాకు చెందిన సయ్యద్ సమీర్ అలియాస్ నవాజ్, మహమ్మద్ అలీం ఇద్దరూ బావమామర్దులు. డ్రైవింగ్ చేస్తూ జీవనం సాగిస్తుండగా, మద్యానికి బానిసై జల్సాలకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడుతుండేవారు. ఈ క్రమంలో ఇంటి వద్ద నిలిపిన ఆటోలు, రోడ్డు పక్కన నిలిపిన వాహనాలను దొంగిలించి ఇతర ప్రాంతాల్లో విక్రయించేవారు. జిల్లా కేంద్రంలో దొంగతనం చేసిన ఆటోను కర్నాటక రాష్ట్రంలోని రాయచూర్‌లోని రైల్వేస్టేషన్ పరిసరాల్లో ఆటోను అమ్మేందుకు ప్రయత్నించారు. వాహనాలకు సరైన ధ్రువపత్రాలు లేకపోవడంతో వాటిని ఎవరూ కొనుగోలు చేయలేదన్నారు. తిరిగి ఆటోను తీసుకొని రాయచూర్ నుంచి జడ్చర్లకు గద్వాల మీదుగా బయలుదేరారని, నెంబర్ ప్లేట్ లేకుండా వెళ్తుండడంతో అనుమానం వచ్చి వివరాలు అడుగగా మొత్తం 12 ఆటోలు దొంగిలించినట్లు ఒప్పుకున్నారు. వాటిలో 5 ఆటోలు పెబ్బేర్ లారీ ట్రాన్స్‌పోర్ట్ పక్కన, 6 ఆటోలు జడ్చర్లలోని మన్సూర్ దాబా వెనుక నిలిపారు. వాటిని పోలీసులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.


## గతంలోనూ పలు కేసులు..

నిందితులు సయ్యద్ సమీర్, మహమ్మద్ అలీం గత సంవత్సరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూల్ టౌన్‌లో ఆటోలను దొంగతనం చేస్తూ పట్టుబడగా, ఇద్దరిని కర్నూల్ జిల్లా పోలీసులు అరెస్టు చేసినట్లు ఎస్పీ వెల్లడించారు. మహమ్మద్ అలీం మార్చి నెలలో సూర్యాపేట, కొత్తకోట పరిసర ప్రాంతాల్లో ఆటోలను దొంగతనం చేయగా, సూర్యాపేట పోలీసులు అరెస్టు చేశారన్నారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. అదనపు ఎస్పీ రవి సూచనలతో డీఎస్పీ వెంకటేశ్వర్లు, గద్వాల సీఐ శ్రీనివాస్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ భగవంత్‌రెడ్డి, టౌన్ ఎస్సై శ్రీకాంత్, ఐటీ కోర్ ఎస్సై రజిత కేసును చేధించారు. కేసును చేధించిన వారికి ఎస్పీ క్యాష్ రివార్డ్‌తో ప్రత్యేకంగా అభినందించారు.

# దేవరకద్రలో మెగా వైద్యశిబిరం



వైద్య బృందాన్ని సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి



రోగులకు మందులు అందజేస్తున్న డాక్టర్ సురేందర్‌రెడ్డి

మూసాపేట, సెప్టెంబర్ 30 : ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని హైదరాబాద్‌లోని మలక్‌పేట యశోద మల్టీ స్పెషాలిటీ దవాఖాన సౌజన్యంతో శనివా రం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతమైంది. యశోద దవాఖాన డాక్టర్ తోకల సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు కార్డియాలజీ, క్యాన్సర్, మూత్రపిండాలు, స్త్రీ వ్యాధి, ఆస్టాలజీ, న్యూమరాలజీ, నేత్రాలజీ, డెర్మటాలజీ, ఆర్థో, ఆప్తమాలజీ, గాస్టో ఎంట్రాలజీ తదితర వ్యాధులకు సంబంధించిన ప్రత్యేక వైద్య నిపుణులతో ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. మొత్తం 654 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. అదేవిధంగా 126 మంది రక్తదానం చేసినట్లు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. జన్మదిన వేడుకలను పురస్కరించుకొని ప్రత్యేకంగా వైద్య వైద్య శిబిరం నిర్వహించి మందులు అందజేసిన యశోద దవాఖాన బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వైద్య బృందాన్ని సన్మానించారు.

# సంపులో పడి బాలుడు మృతి



గట్టు (ఫైల్)

మదనాపురం, సెప్టెంబర్ 30 : ప్రమాదవశాత్తు సంపులో పడి బాలుడు మృతిచెందిన ఘటన మండలంలో చోటుచేసుకున్నది. గ్రామస్తుల కథనం ప్రకారం.. మండలంలోని గోవిందహళ్లికి చెందిన గౌనికాడి గట్టు(7) శుక్రవారం రాత్రి వినాయక నిమజ్జనానికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న నేపథ్యంలో దాసరి శ్రీనివాసులు ఇంటి ఎదుట ఏర్పాటు చేసిన నీటి సంపులో ప్రమాదవశాత్తు పడి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి తక్షణ సాయంగా బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందించాలని బీఆర్ఎస్ నాయకులకు సూచించారు. జెడ్పీటీసీ కృష్ణయ్య, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు యాదగిరి బాధిత కుటుంబానికి రూ.5వేలు అందజేశారు. పరామర్శించిన వారిలో సర్పంచ్ శ్రీనివాసులు, కోఆప్షన్ సభ్యుడు చాంద్‌పాషా, మండల ప్రచార కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, రమేశ్, విష్ణు, రామ్‌కుమార్‌గౌడ్, కృష్ణ, మనోజ్ కుమార్, రవికుమార్, కరుణాకర్ తదితరులు ఉన్నారు.

# మేమంతా ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ వెంటే..

• మద్దతిచ్చిన కుప్పగండ్ల గ్రామస్తులు

కల్వకుర్తి రూరల్, సెప్టెంబర్ 30 : ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ వెంటే మేమంతా ఉంటామని మండలంలోని కుప్పగండ్ల గ్రామస్తులు తమ మద్దతు తెలిపారు. శనివారం కల్వకుర్తిలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కుప్పగండ్ల నాయకుడు శేఖర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసి తమ మద్దతు జైపాల్‌యాదవ్‌కే ఉన్నదన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి జైపాల్‌యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని, రాష్ట్రంలో బీఆర్ఎస్ హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, నాయకులు ఉన్నారు.



ఎమ్మెల్యేకు మద్దతిచ్చిన కుప్పగండ్ల గ్రామస్తులు

# చీపురు చేతబట్టిన జడ్జీలు

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 30 : పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యకరమైన జీవనం సాధ్యమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజేశ్‌బాబు అన్నారు. శనివారం జిల్లా కోర్టు ఆవరణలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి ఇతర జడ్జిలు, న్యాయవాదులతో కలిసి కోర్టు ఆవరణలో చెత్తాచెదారం తొలగించారు. అనంతరం ఆవరణలో మొక్కలు నాటి నీళ్లు పోశారు. కోర్టు ఆవరణంతా పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించినప్పుడే ఆరోగ్యవంతమైన జీవనం సాగిస్తామన్నారు. విధిగా మొక్కలు నాటి వాటికి కాపాడే బాధ్యత తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి మౌనిక, న్యాయవాదులు శ్రీనివాస్‌రెడ్డి, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కోర్టు ఆవరణలో చెత్తను తొలగిస్తున్న జడ్జిలు రాజేశ్‌బాబు, మౌనిక